క్లుప్తంగా

ఎమ్మార్సీకి చేరిన పాఠ్య పుస్తకాలు



పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ చక్రధర్‌రాజు

పుల్లంపేట : స్థానిక ఎమ్మార్సీ కార్యాలయనికి పాఠ్య పుస్తకాలు వచ్చినట్లు సోమవారం ఎంఈఓ చక్రధర్‌రాజు సోమవారం విలేకరులకు తెలిపారు. 2025 – 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 1వ తరగతి నుంచి పదవ తరగతి వరకు పాఠ్య పుస్తకాలు వచ్చాయని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా అందజేయడం జరుగుతందని ఎంఈఓ తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్సీలో ఆయన పర్యవేక్షించారు.

ఆలయ ప్రహరీ గోడ నిర్మాణానికి విరాళం

సుండుపల్లె : మండల పరిధిలోని ముడుంపాడు గ్రామ పంచాయతీ కురవపల్లి సమీపంలోని మల్లిఖార్జున స్వామి ఆలయ ప్రహరీ గోడ నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన దేవపట్ల సతీష్‌కుమారరెడ్డి రూ.3,06,648 నగదును విరాళంగా దేవాలయ అభివృద్ధి కమిటీ ఖాతాకు జమ చేశారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ ప్రహరీ గోడ నిర్మాణానికి సహకరించినందుకు ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో మరిన్ని దైవ కార్యక్రమాలకు సహకరించాలని వారు కోరారు.

గంగనపల్లికి ఆహ్వానం



రాజంపేట టౌన్ : ఈనెల 8వ తేదీ హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభ సమావేశంలో తెలుగుభాషా చైతన్య సమితి ఆధ్వర్యంలో జరిగే తెలుగు భాషా సదస్సుకు రాజంపేట పట్టణానికి చెందిన తెలుగు పండితుడు, కవి అయిన గంగనపల్లి వెంకటరమణకు ఆహ్వానం అందింది. ఈ విషయాన్ని సోమవారం ఆయన ఇక్కడి విలేకరులకు తెలిపారు. తెలుగుభాషా సదస్సులో తాను తెలుగుభాషాభివృద్ధి – పరిరక్షణ అనే అంశంపై ఉపన్యసించనున్నట్లు చెప్పారు. తెలుగుభాషా సదస్సుకు గంగనపల్లికి ఆహ్వానం అందడం పట్ల సమితి ప్రతినిధులు బొట్టు రామచంద్రనాయుడు, బీవీ నారాయణరాజు హర్షం వ్యక్తం చేశారు.

ఉచిత సమ్మర్ క్యాంపు



క్రీడా క్యాంపులో పాల్గొన్న క్రీడాకారులు

ఓబులవారిపల్లె : వైకోట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో వాలీబాల్, సాఫ్ట్‌బాల్ క్రీడలపై బాలుర క్రీడాకారులకు ఉచితంగా వేసవి శిక్షణ ఇవ్వడం జరుగుతోందని వ్యాయామ ఉపాధ్యాయుడు అబ్దుల్లా తెలిపారు. సోమవారం వాలీబాల్, సాఫ్ట్‌బాల్ శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా అబ్దుల్లా మాట్లాడుతూ ఈ నెల ఒకటవ తేదీ నుండి ప్రారంభించడం జరిగిందని వయస్సు పరిమితి లేదని నియోజవర్గంలోని అసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొవాలని ఆయన కోరారు.

ఘనంగా అంకాలమ్మ జాతర



పూజలందుకుంటున్న అంకాలమ్మ

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలంలోని శెట్టిగుంట గ్రామంలో సోమవారం వైభవంగా అంకాలమ్మ జాతర వైభవంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పలు పార్టీల నాయకులు, ప్రముఖులు అమ్మ వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. సంప్రదాయబద్ధంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి జాతర చేశారు. అనంతరం మహిళలు అంకాలమ్మ పొంగుబాలు పొంగించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ప్రజాశ్రేయస్సు కోసం పనిచేస్తా



ఇన్‌చార్జ్ ఎంపీపీని సన్మానిస్తున్న సిబ్బంది

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట ఇన్‌చార్జ్ ఎంపీపీ నల్లగొండ లక్ష్మీదేవికి రాచపల్లి సచివాలయంలో సచివాలయం, పంచాయతీ సిబ్బంది ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది శాలువా, గజమాలతో ఘనంగా సన్మానించారు. అలాగే రాజగుడిపల్లి, రాచపల్లి, సీతాపురం, నారాయణరాజుపేట తదితర గ్రామాల నుంచి నాయకులు విచ్చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సు కోసమే పని చేస్తానని తెలిపారు. జిల్లాలోనే ఒంటిమిట్ట మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతానన్నారు. మండలంలోని నాయకులందరూ సమష్టిగా తన గెలుపునకు కృషి చేశారన్నారు. అందరి ఆశీస్సులతో ఒంటిమిట్ట మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. అలాగే మండలంలోని అధికారులు కార్యాలయాలు చుట్టూ ప్రజలను తిప్పుకోవద్దని, వారి పనులు సత్వరమే పరిష్కరించాలన్నారు.

సెలవులకు ఊరెళుతున్నారా.. జర భద్రం

- మొదలైన దొంగల బెడద
- తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసి చోరీలకు పాల్పడుతున్న దొంగలు
- ఊరికెళ్లే వారు జాగ్రత్తలు తీసుకోవాలంటున్న పోలీసు అధికారులు

రాజంపేట టౌన్ : వేసవి సెలవులు వచ్చాయి. ప్రస్తుతం చాలా మంది తమ సొంత ఊళ్లకు, పర్యాటక ప్రాంతాలకు వెళుతున్నారు. ఇదే సమయంలో దొంగల బెడద కూడా ఎక్కువైంది. దొంగలు తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసి దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇంటికి ఉండే సేఫ్టీ గ్రిల్‌కు వేసం తాళం పగులగొట్టి ఆ తరువాత మెయిన్ డోర్‌ను కూడా బద్దలు చేసి దొంగలు ఇళ్లల్లోకి ప్రవేశించి దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇంటి తలుపులు ఎంత భద్రంగా ఉన్నా దొంగలు వాటి బద్దలు చేస్తున్నందున ఊళ్లకు వెళ్లే వారు లాకర్ సౌకర్యం ఉంటే బంగారు నగలు వంటివి లాకర్లలో పెట్టుకోవాలని, లాకర్ సౌకర్యం లేని వారు నమ్మకమైన బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో భద్రపరుచుకోవాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు. అలాగే డబ్బు కూడా ఇంటిలో పెట్టుకోకుండా తమ బ్యాంకు ఖాతాల్లో వేసుకోవాలని చెబుతున్నారు. ప్రయాణ సమయాల్లోనూ ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, లేకుంటే విలువైన బంగారు గొలుసులు, ఉంగరాలు చోరీకి గురయ్యే అవకాశం ఉందని పోలీసు అధికారులు చెబుతున్నారు. ఇదిలావుంటే ఇటీవల రాజంపేట సబ్ డివిజన్ పరిధిలో చోరీలు జరగడంతో రాజంపేట పోలీసులు ఆటోకు మైక్ ఏర్పాటు చేయించి దొంగతనాలపై ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.



ఇటీవల రాజంపేటలోని విద్యానగర్‌లో ఓ ఇంటి తలుపును బద్దలు కొట్టిన దొంగలు



ఇంటిలో చోరీకి పాల్పడి దుస్తులను చెల్లాచెదురుగా పడేసిన దొంగలు

ఇంటివద్ద ఇలాంటి జాగ్రత్తలు పాటించాలి

- ఊరికి వెళ్లే సమయంలో ఇంటిలోని అన్ని తలుపులకు తాళాలు వేసుకోవాలి
- ప్రధానంగా ఇంటి ప్రధాన ద్వారానికి వేసే తాళం నాసిరకంది కాకుండా చూసుకోవాలి
- తాళం వేసినట్లు కనిపించకుండా కర్టన్ వేసి ఉంచాలి
- ఇరుగు, పొరుగు వారికి తమ ఇంటిని గమనిస్తూ ఉండమని చెప్పాలి. అలాగే రోజుకు ఒకటి, రెండుమార్లు తమ ఇంటికి గురించి ఫోన్ చేసి తెలుసుకుంటూ ఉండాలి
- వీలైతే నమ్మకమైన వ్యక్తులను రాత్రి వేళల్లో ఇంటిలో పడుకునే ఏర్పాటు చేసుకోవడం సురక్షితం
- లాకర్‌లు ఉన్న వారు బంగారు ఆభరణాలను లాకర్‌లో భద్రపరుచుకోవడం శ్రేయస్కరం
- ప్రస్తుతం మార్కెట్‌లో వైఫైతో కూడిన సీసీ కెమెరాలు అందుబాటులో ఉన్నాయి. వీటి ధరలు మధ్య తరగతి ప్రజలకు కూడా అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం అందరి వద్ద ఆండ్రాయిడ్ ఫోన్‌లు ఉన్నందున ఇంటివద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకొని ఫోన్‌కు అనుసంధానం చేసుకుంటే ఎప్పటికప్పుడు ఇంటిని పరిశీలించుకుంటూ ఉండవచ్చు. ప్రయాణ సమయంలో ఇలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి
- రైళ్లల్లో ప్రయాణించే వారు తమ లగేజీ బ్యాగులకు చైన్ వేసి తాళం వేసుకోవాలి.
- రైల్వేస్టేషన్, బస్టాండుల్లో మంచినీళ్లకు, వాష్ రూములకు వెళ్లే సమయంలో తెలియని వారికి ఎట్టి పరిస్థితుల్లో లగేజీ అప్పగించకూడదు
- తోటి ప్రయాణికులు ఏవైనా తినుబండారాలు ఇచ్చినా సున్నితంగా తిరస్కరించాలి
- బస్సులన్నీ రద్దీగా ఉంటాయి. బస్సు ఎక్కేటప్పుడు ముఖ్యంగా మహిళలు మెడలో ఉండే బంగారును దొంగలు దొంగలిస్తారు. అందువల్ల మెడలోని నగలు కనిపించకుండా జాగ్రత్త తీసుకోవాలి
- ప్రయాణ సమయంలో బంగారు ఆభరణాలు తక్కువగా ధరించడం మంచిది. ప్రస్తుతం ఫోన్, గూగుల్ పే, నెట్ బ్యాంకింగ్ వంటి సౌకర్యాలు ఉన్నందున ఎక్కువ మొత్తంలో డబ్బులు వెంట తీసుకెళ్లకూడదు.

మహిళా పోలీసులకు సమాచారం ఇవ్వండి



వేసవి సెలవుల్లో చాలా మంది సొంత ఊళ్లకు, పర్యాటక ప్రాంతాలకు వెళుతుంటారు. అలా ఊళ్లకు వెళ్లే వారు తమ ప్రాంతంలోని సచివాలయ మహిళా పోలీసులకు సమాచారం ఇవ్వాలి. తద్వారా మహిళా పోలీసులు తమ దృష్టికి తీసుకువస్తారు. అప్పుడు ఊరికి వెళ్లేవారి ఇంటిపై తమ సిబ్బందిచే ప్రత్యేకంగా నిఘా వేయిస్తాం. వేసవిలో దొంగల బెడద ఎక్కువగా ఉంటుంది. అందువల్ల ఇప్పటికే అన్ని ప్రాంతాల్లో రాత్రి వేళల్లో గస్తీ పెంచాం. అలాగే మైక్‌ల ద్వారా ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. ముఖ్యంగా ప్రజల అప్రమత్తతోనే దొంగతనాల నివారణ సాధ్యం కాగలదు.

– పి.రాజ, అర్బన్ సీఐ, రాజంపేట

కమిషనరుకు సమ్మె నోటీసు



కమిషనరుకు నోటీసును అందచేస్తున్న కార్మికనేతలు

రాజంపేట : ఈనెల 20న దేశవ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా సమ్మె నోటీసును మున్సిపాలిటీ కమిషనరు శ్రీనివాసులకు సోమవారం రాజంపేట కార్మిక నేతలు అందజేశారు. అంతకు ముందు మున్సిపల్ కార్యాలయం ఎదురుగా తమ సమస్యల పరిష్కారం కోసం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. జీఓ నెంబరు 36 ప్రకారం జీతాలు ఇవ్వాలన్నారు. రిటైర్డ్ అయిన కార్మికుల పిల్లలకు ఉద్యోగ అవకాశాలను కల్పించాలన్నారు. వయోపరిమితి 62 ఏళ్లకు పెంచాలన్నారు. సమ్మెకాలంలో ఒప్పందాలకు జీఓ జారీ చేయాలన్నారు.

విజ్ఞాన శిబిరాలకు విశేష స్పందన

సిద్దవటం : గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. సోమవారం విద్యార్థుల చేత నీతి కథలు, పద్యాలను చెప్పించామని గ్రంథాలయాధికారిణి లక్ష్మినారాయణమ్మ తెలిపారు. ఆమె మాట్లాడుతూ సోమవారం రోజు 30 మంది విద్యార్థులు ఈ సమ్మర్ క్యాంపునకు హాజరయ్యారన్నారు. ముందుగా విద్యార్థులతో జాస్మిన్, సనా, సాహినా విద్యార్థులతో ధ్యానం చేయించారు. తరువాత విద్యార్థులతో చెస్, లూడో, క్యారంస్ ఆడించారు. అలానే డ్యాన్స్ చేయించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు, బిస్కెట్‌లను అందజేశామన్నారు.

గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలి



సమస్యలను వింటున్న ఎంపీపీ సుధామాధురి

చిన్నమండెం : మండల వ్యాప్తంగా గ్రామాల్లో నీటి సమస్యలు లేకుండా చూడాలని అధికారులను మండల పరిషత్ అధ్యక్షురాలు సుధా మాధురి ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వేసవికాలం తీవ్రంగా ఉందని నీటి సమస్యలపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే కొత్తపల్లి గ్రామం శ్రీనివాసపురంలో ఒక వీధికి నీటి సరఫరా కావడం లేదని ఆ గ్రామ ఎంపీటీసీ ఫిర్యాదు మేరకు వెంటనే స్పందించిన ఎంపీపీ సంబంధిత ఏఈ హరినాథరెడ్డి, ఎంపీడీఓ శేఖర్‌నాయక్‌లను సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ఉపాధి ఏపీఓ మాట్లాడుతూ గడ్డి పెంపకానికి పండ్ల తోటలకు దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేస్తామన్నారు. మండలంలో పశువులకు 18 నీటితొట్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎంఈఓ శివానాయక్ మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశానికి 78 శాతం మంది ఎంపికయ్యారని తెలిపారు. అలాగే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు మండలానికి చేరాయన్నారు. 25 మెట్రిక్ టన్నుల పశు దాణా మండలానికి మంజూరైనట్లు పశువైద్యాధికారి గణేష్ తెలిపారు. దానిని ఒక్కో కార్డుదారునికి ఒక బస్తా చొప్పున 50 శాతం సబ్సిడీతో పంపిణీ చేస్తామన్నారు. ప్రతి నెలా 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు అంగన్వాడీ కేంద్రాలకు బియ్యం పంపిణీ చేయాలని సంబంధిత అధికారులు సభలో తెలిపారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు ఏజాస్ అలీఖాన్, గౌస్‌సాబ్, శ్యామ్, వెంకటప్పనాయుడు, రమణ, శ్రీరాములు, నాగులయ్య, సర్పంచులు లోకేశ్వర్‌రెడ్డి, ముసల్‌రెడ్డి, లక్ష్మణరెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, అఫ్రోజ్, సుధాకర్, కృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతులకు బీమా అందించాలి

రాయచోటి టౌన్ : మామిడి రైతులకు ప్రభుత్వం బీమా అందించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరికి వినతి పత్రాన్ని అందించారు. సోమవారం కలెక్టరేట్ ఎదురుగా రైతు సంఘం నాయకులతో కలసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి డివిజన్ పరిధిలోనే కాకుండా మదనపల్లె నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలలో మామిడి పంట ఆశాజనకంగా లేదన్నారు. పూత విరగకాసినా కాయలు మాత్రం అంతంత మాత్రంగా కాశాయని చెప్పారు. అయితే అకాల వర్షాలతో కాసిన కాయలన్నీ నేలరాలాయని దీంతో మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. నష్టపోయిన మామిడి రైతలతో అధికారులు సమీక్ష నిర్వహించి జరిగిన నష్టాన్ని గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మామిడి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో హరినాథనాయుడు, బాలకృష్ణారెడ్డి, కెవి రమణ తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగలో విత్తన శుద్ధి తప్పనిసరి

సిద్దవటం : మండలంలోని వంతాటిపల్లె గ్రామంలో సోమవారం విత్తన శుద్ధి ప్రాముఖ్యతను తిరుపతి శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు రైతులకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేరుశనగలో విత్తన శుద్ధికి కిలో విత్తనానికి ఒక గ్రాముల టేబుకోనజోల్ 2 డిఎస్ లేదా 3 గ్రాముల మ్యాంగోజెబ్ లేదా 8 గ్రాముల ట్రైకోడెర్మా విరిడి పొడి మందును పట్టించాలన్నారు. కాండం కుళ్లు వైరస్ తెగులు, వేరుపురుగు ఆశించే ప్రాంతాలలో విత్తనానికి 2 మిల్లీ లీటర్లు ఇమిడా క్లోపిడ్ 600 ఎఫ్ఎం4 మిల్లీ లీటర్లు నీళ్ల మిశ్రమం మందుతో విత్తన శుద్ధి చేయాలన్నారు. లేదా కిలో విత్తనానికి ఇమిడియాక్లోరోపిడ్ 17.8 ఎస్.ఎల్ 2 మిల్లీ లీటర్ల చొప్పున కలిపి విత్తన శుద్ధి చేసుకోవచ్చునన్నారు. వరి మాగానుల్లో లేక కొత్తగా వేరుశనగ సాగు చేసేటప్పుడు విత్తనానికి రైజోబియం కల్చర్‌ని పట్టించాలన్నారు. విత్తనాన్ని మొదటగా క్రిమి సంహారక మందులో శుద్ధి చేసి నీడలో ఆరబెట్టి తరువాత శిలీంద్ర నాశినితో శుద్ధి చేయాలన్నారు. అవసరమైతే రైజోబియం కల్చర్‌ను కూడా విత్తనాలుకు పట్టించవచ్చునన్నారు. ఇలా చేయడం వల్ల మొదలు కుళ్లు వేరు కుళ్లు, కాండం కుళ్లు, తెగులు తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు ప్రవీణ్, పాలు, అశోక్, అరుణ్, వివేక్ వీఏఏ ప్రేమ్ రైతులు పాల్గొన్నారు.

రమేష్‌రెడ్డికి అభినందనల వెల్లువ



రమేష్‌రెడ్డిని సత్కరిస్తున్న మండల వైఎస్సార్‌సీపీ నాయకులు

లక్కిరెడ్డిపల్లి : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్ రెడ్డిని హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమించినందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు అభినందనలు తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీటీసీ దస్తగిరితో పాటు మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చాన్‌బాషా, వార్డు మెంబర్ ఖాజా, మాజీ సర్పంచ్ దుర్గయ్య, షామీర్, బాబ్ జాన్, మండల మైనార్టీ నాయకులు నవాజ్, కువైట్ బాషా, వైఎస్ఆర్సీపీ నాయకులు లక్ష్మీ రెడ్డి, రమణరెడ్డిలు రమేష్ రెడ్డిని దుశ్శాలువాతో సత్కరించి, గజమాలలు వేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రమేష్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తానన్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి



రక్తదానం చేస్తున్న యువకులు

రాయచోటి టౌన్ : 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఆరోగ్యవంతుడు రక్తదానం చేయవచ్చని హెల్పింగ్ హ్యాండ్స్ బ్లడ్ ఆర్గనైజేషన్ నేషనల్ బ్లడ్ ప్రమోటర్ డాక్టర్ మైనుద్దీన్ తెలిపారు. సోమవారం పట్టణంలోని దీపా బ్లడ్ బ్యాంక్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 25 మంది రక్తదానం చేశారు. మైనుద్దీన్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి రక్తం చాలా అత్యవసరమైనదన్నారు. అలాంటి సందర్భంలో ఆరోగ్యంగా ఉండే 18 సంవత్సరాలు నిండిన వారు ఎవరైనా రక్తదానం చేసేందుకు ముందుకు రావచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో షాబుద్దీన్, మహమ్మద్, షేక్ అజ్జాస్, సమీర్, సనాన్, షాహీం షా తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి



చిన్నమండెం: ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి బోయల పోస్టుకార్డు ఉద్యమం



గాలివీడు: పోస్టు కార్డు ఉద్యమంలో పాల్గొన్న బండి వెంకటసాయి తదితరులు

గాలివీడు : వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆర్‌వీఎస్ఎస్ రాష్ట్ర యూత్ వింగ్ అధ్యక్షులు బండి వెంకటసాయి డిమాండ్ చేశారు. సోమవారం గాలివీడు మండలంలోని పక్కీరారెడ్డిగారిపల్లె, బురుజుపల్లి-2, గోరాన్‌చెరువు, గుండ్లచెరువు, తూముకుంట, ప్రకాష్ నగర్ కాలనీ గ్రామాల్లో ఆర్‌వీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బంగారు కృష్ణమూర్తి ఆదేశాల మేరకు పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019లో కర్నూల్ మహాసభలో వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేరుస్తామన్న ప్రధాన మంత్రి హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయల విషయంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15, 341, 342, 29(డీ) లు అమలు కావడం లేదని, రాజ్యాంగ ఉల్లంఘన జరిగిందని ప్రధాని చొరవతో తమ సమస్యను పరిష్కరించాలని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు బండి సాయినాథ్, ఆర్‌వీఎస్ఎస్ గాలివీడు యూత్ ప్రధాన కార్యదర్శి ముండ్ల నరసింహులు, జనరల్ సెక్రెటరీ సాయిబోధ, ఆంజనేయులు, రెడ్డి కిషోర్, బాలజీ, పావనీ, రమాదేవి, లలిత, పండు, హిమబిందు, భవానీ తదితరులు పాల్గొన్నారు.

పోస్ట్‌కార్డు ఉద్యమం

చిన్నమండెం : వాల్మీకి బోయ కులస్తులను ప్రభుత్వం వెంటనే ఎస్టీ జాబితాలో చేర్చాలని పోస్ట్‌కార్డు ఉద్యమం చేపట్టినట్లు రాష్ట్ర వాల్మీకి సేవా సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు మండ్ల జయశంకర్ తెలిపారు. మండల పరిధిలోని మల్లూరు గ్రామం కొత్తపేటలో వాల్మీకి కులస్తులతో పోస్టు కార్డు ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా జయశంకర్ మాట్లాడుతూ 2019లో కర్నూలులో జరిగిన మహాసభలో వాల్మీకి/ బోయలను ఎస్టీ జాబితాలో చేరుస్తామని ప్రధాన మంత్రి హామీ ఇచ్చారని ఆ మాట నిలబెట్టుకోవాలని పోస్టుకార్డు ఉద్యమం చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సేవా సంఘం నాయకుడు సుధాకర్, జిల్లా ట్రెజరర్ మండ్ల వెంకటాద్రి, సంజీవయ్య, అశోక్, వెంకటేశు, రమణయ్య, కృష్ణయ్య, పార్వతి, సరస్వతి, వెంకటాద్రి, అన్నయ్య, అమ్మణ్ణి, భూదేవమ్మ, రవణమ్మ, పాపులమ్మ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరిస్తాం

వీరబల్లి : మండలంలోని వంగిమళ్ల పంచాయతీలో పోల్ చెన్నారెడ్డిగారిపల్లి ఎస్టీ కాలనీలో గత శనివారం నీటి సమస్య తీర్చాలంటూ ఎంపీపీ రాజేంద్రనాథ్ రెడ్డికి గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఎంపీడీఓ నూర్జహాన్ స్పందించి సోమవారం గ్రామానికి వెళ్లి ప్రజలతో మాట్లాడి నీటి సమస్యపై ఆరా తీశారు. తమకు తాగడానికి మంచినీరు లేవని, తమ గ్రామం పక్కన ప్రవహిస్తున్న మాండవ్య నది నుంచి అక్రమంగా ఇసుకను రాత్రింబవళ్లు తరలించడంతో తమకు నీరు లేకుండా, ఉన్న నీరు అడుగంటి పోయిందని గ్రామస్తులు ఎంపీడీఓకు తెలిపారు. ప్రస్తుతం నీటి సమస్య తీర్చుటకు ట్యాంకర్ ద్వారా మంచి నీటిని సరఫరా చేస్తామని ప్రజలకు ఆమె హామీ ఇచ్చారు.

సమస్యలు పరిష్కరించండి

చిన్నమండెం : రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోమవారం చిన్నమండెం మండల పర్యటన సందర్భంగా మల్లూరు కస్పాలో మినీ బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మల్లూరు కస్పా గ్రామ ప్రజలు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యలను విన్న మంత్రి అక్కడికక్కడే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలు పరిష్కరించారు. దీంతో మల్లూరు కస్పా ప్రజలు మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'బీసీలకు ఉపాధి పేరుతో భారీ స్కాం'

రాయచోటి జగదాంబ సెంటర్ : బీసీల పేరు చెప్పి రూ.245 కోట్ల భారీ స్కాంకు కూటమి ప్రభుత్వం పాల్పడిందని రాష్ట్ర వైఎస్ఆర్‌సీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి శిబ్యాల విజయభాస్కర్ తెలిపారు. వైఎస్సార్సీపీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. బీసీల ఉపాధి కల్పన పేరుతో కూటమి ప్రభుత్వం భారీ దోపిడీకి పాల్పడిందని ఆరోపించారు. ప్రభుత్వం కుట్టు మిషన్ల పంపిణీ, టైలరింగ్ లక్ష మందికి ట్రైనింగ్ అందించాలని నిర్ణయించిందన్నారు. శిక్షణకు అయ్యే ఖర్చుకంటే కూటమి ప్రభుత్వం రెండింతలు ఎక్కువ ఖర్చు చేసినట్టు చూపి రూ.167 కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేసిందని మండిపడ్డారు. ఒక కుట్టు మిషన్ శిక్షణలోనే వందల కోట్లు దోచేస్తుంటే ఇక పోలవరం, రాజధాని నిర్మాణం పేరుతో ఎన్ని వేల కోట్ల దోపిడీ పథకం రచించారో ప్రజలు తెలుసుకోవాలన్నారు. వీటన్నిటికీ ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. బీసీల ఓట్లతో గద్దెనెక్కి ఈ రోజు బీసీలకే కుచ్చుటోపి పెడుతున్న కూటమి ప్రభుత్వ మోసపూరిత వైఖరిని బీసీలు తెలుసుకొని కూటమికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. సీఎం చంద్రబాబు నాయుడుకి మొదటి నుంచి దోచుకోవడం.. దాచుకోవడమే తెలుసని పేర్కొన్నారు. ప్రజలు ప్రభుత్వానికి గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయని ఆయన ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సంజీవయ్య, శివశంకర్ యాదవ్, గువ్వల బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి పెంచల లక్ష్మీనారసింహుని బ్రహ్మోత్సవాలు



లక్ష్మీనరసింహుడి మూల విరాట్

సిద్దవటం : మండల శివారులోని జేఎంజే కళాశాలకు ఎదురుగా వెలసిన శ్రీ పెంచల లక్ష్మినరసింహ స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు ఈనెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరుగునని ఆలయ సహాయ కార్యదర్శి పాలెం నరసింహ తెలిపారు. సోమవారం ఆయన సిద్దవటంలో మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 10వ తేదీన స్వామి వారికి గణపతి పూజ, పుణ్యహావాచనం, గోపూజ, యాగశాల ప్రవేశం, కలశపూజ, నవగ్రహ నరసింహ జపం, దీక్షా హోమం, అభిషేకం, తీర్థ ప్రసాదాల వినియోగం వంటి పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 11వ తేదీన లక్ష్మీనారాయణ జపం, నరసింహ హోమం, సుదర్శన హోమం, లక్ష్మీ హోమం, పూర్ణాహుతి, కుష్మాండ బలి, ఉత్సవ విగ్రహాలకు క్షీరాభిషేకం, తీర్థ ప్రసాదాల వినియోగం వంటి పూజా కార్యక్రమాలు చేయనున్నట్టు పేర్కొన్నారు. సాయంత్రం లక్ష్మినరసింహ సహస్ర నామావళి, లక్ష్మి సహస్ర నామావళి, దీక్షాహోమం, తీర్థ ప్రసాదాల వినియోగం వంటి పూజలు జరుగునన్నారు. రాత్రి వెలుగుపల్లె గ్రామానికి చెందిన పాలెం చిన్న సుబ్బరాయుడు, తిరుపతమ్మ, మాదాసు వెంకటేష్, శోభారాణిల ఆధ్వర్యంలో ఒంటిమిట్ట చెందిన చెక్కభజన బృందంతో చెక్కభజనలు ఉంటాయన్నారు. 12వ తేదీన తెల్లవారుజామున గరుడసేవ, సుదర్శన హోమం, అనంతరం లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణ మహోత్సవం, పూర్ణాహుతి వంటి పూజలు జరుపనున్నట్టు తెలియజేశారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రాజంపేట : ఎస్ఎంయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం అపరిష్కృతంగా ఉన్న ఆర్టీసీ కార్మికులు సమస్యలపై స్థానిక తహసీల్దారు పీరు మున్నీకి ఎస్ఎంయూ డిపో నేతలు వినతిపత్రాన్ని అందజేశారు. మహిలా ఉద్యోగులకు సంబంధించి 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని కోరారు. చైల్డ్ కేర్ లీవులు మంజూరు చేయాలన్నారు. పదోన్నతులను కల్పించాలన్నారు. గ్యారేజ్‌లో సరైన పనిముట్లు కల్పించాలన్నారు. ఆరోగ్య సెలవులకు పూర్తి జీతం ఇవ్వాలన్నారు. పారదర్శకంగా బదిలీలు చేపట్టాలన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు సూపర్ లగ్జరీ బస్సులలో అనుమతించాలన్నారు. ఆర్టీసీలో అన్ని క్యాడర్స్‌ను బలోపేతం చేయాలన్నారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్నారు. వినతిపత్రం అందచేసిన వారిలో రాజంపేట జేఏసీ చైర్మన్ శెట్టం వెంకటరమణ, డిపో కార్యదర్శి రమణ, అధ్యక్షుడు శివయ్య, కన్వీనరు కేహెచ్‌ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ జీబీ రమణ, చైర్మన్ కేజీప్రసాద్, అధ్యక్షులు జయశంకర్, ఎమ్మెస్ శంకర్, కోశాధికారి బీజే ప్రకాష్, గ్యారేజ్ ట్రెజరర్ బీఎస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



రాజంపేట: తహసీల్దారు పీరుమున్నీకి వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎంయూ నేతలు



రాయచోటి టౌన్: ఆర్‌డీఓ కార్యాలయ ఏఓకు వినతి పత్రాన్ని అందజేస్తున్న ఎస్ఎంయూ నేతలు

సమస్యలు పరిష్కరించాలంటూ నిరసన

రాయచోటి టౌన్ : తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఏపీపీటీడీ – ఎస్ఎంయూఏ ఆధ్వర్యంలో రాయచోటి రెవెన్యూ కార్యాలయంలోని ఏఓ తులశమ్మకు వినతి పత్రాన్ని అందించారు. సోమవారం రాయచోటి ఆర్టీసీ డిపోకు చెందిన ఎస్ఎంయూఏ కార్మిక సంఘం నాయకులు 58 డిమాండ్లు ఉన్న వినతి పత్రాన్ని ఆమెకు అందజేశారు. అన్నమయ్య జిల్లా ప్రెసిడెంట్ ఎంఎన్‌రావు మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని కోరారు. మహిళా ఉద్యోగలకు చైల్డ్ కేర్ లీవులు ఇప్పించాలని, సిబ్బంది కొరత పరిష్కరించి, కొత్త ఉద్యోగాలు ఇవ్వాలని, కొత్త బస్సులు కొనుగోలు చేయాలని కోరారు. 73 రోజుల నుంచి నిరసన కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ యాజమాన్య పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే స్పందించి తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు.